


# మిసెస్ మధుబాబ్

యామినీ సరస్వతి

మద్రాస్‌నుంచి వచ్చిన ఆర్.టి.సి. బస్ ఆగగనే దిగి నా భార్యని పిల్లల్ని కూడా జాగ్రత్తగా దింపి, సామాను దింపించి రిక్షా చేసుకుని వెళ్ళి లాడ్జింగులో దిగాను. నంద్యాల్‌లో శోభా లాడ్జి కట్టాక నాలాటివాళ్ళకి కాస్త హాయిగా వుంది. సమీపంలో సినిమాహాలు వున్నా వూరికి దక్షిణంగా రోడ్ ఆనుకుని ప్రశాంతంగా వుంటుంది ఆ లాడ్జి. అన్ని వస్తువులూ దొరకటమే కాకుండా భోజనంకూడా బావుంటుంది. ఇంతెందుకు అన్ని విధాలా బావుంటుంది. శోభ శోభే!

రూమ్‌లోకి వెళ్ళగానే బూట్ విడిచి కోట్ విడిచి లుంగీ చుట్టబెట్టుకుని టవల్, సోప్ తీసుకుని బాత్‌రూమ్‌లో దూరబడ్డాను. శ్రీమతి పిల్లల్ని సర్ది అప్పుడే వచ్చిన టిఫిన్‌ని తినిపించడంలో నిమగ్నమైంది. పిల్లల దయ్యాక మేం చేస్తే హాయిగా వుంటుంది. ఇలాటి జాగ్రత్తల్లో ఆవిడదెప్పుడూ పై చెయ్యే!

ఏదో నోటికి నచ్చిన ట్యూన్‌ని మెల్లిగా హమ్ చేస్తూ స్నానం ముగించుకుని బయటికి వచ్చాను.

"ఏదేశ మేగినా ఎందు కాలిడినా చెయ్యరా స్నానమ్ము జాము సేపయినా" అన్నట్టు యిప్పుడు అరగంట స్నానమా అంది చిరునవ్వుతో ఆవిడ.

"హాయిగా స్నానం చేయటంలో వున్న సుఖం యింకెందులోనూ లేదు. వెళ్ళి స్నానం చేసిరా. టిఫిన్ తెప్పిస్తాను" అన్నాను. నవ్వుతూ దూరింది.

"రాజుని చూస్తోందండి" అని ఆవిడ బాత్‌రూంలో.

చిటికె వేసి పిలిచాను.

నవ్వుతూ ప్రాకి వచ్చాడు వాడు. లేక లేక పెళ్లయిన పదేళ్ళకే పుట్టాడు వాడు ఇంకా రెండేళ్ళు నిండలేదు. నిండుగా, ముద్దుగా 'మాడల్ బాయ్'లా వుంటాడు. పుట్టేప్పుడు తల్లికి గండం తెబోయేదు. డాక్టర్ ప్రియ గారి చేతి చలవతో ఆపరేషన్ పుణ్యాన యిద్దరూ బయటపడ్డారు గండం నించి. ఇక మళ్ళీ ఆవిడకి కాన్పు రాకూడదనటంతో వెంటనే నేను ఆపరేషన్ వేసక్టమీ చేయించుకున్నాను ఇన్నిటివల్ల వాడంటే మాకు ప్రాణం!

'మామయ్యా!' లాన్‌లో నుంచున్న శ్రీధర్, నందా గదిలోకి వస్తూ 'ఎవరో వచ్చారు నీకోసం' అన్నారు ఒకేసారి.

'అప్పుడే మొదలైందా?' అనుకున్నాను విసుగ్గా.

ఈ మధ్య ఓ సినిమాకి కథ; ఓ సినిమాకి కథ – మాటలూ వ్రాయటంతో నా పేరు కాస్త పదిమంది నోళ్ళల్లో మెదలుతోంది. పైగా ఓ ప్రముఖ వీక్లీలో యీ వారమే నా నవల కూడా ప్రారంభమైంది ఇక ప్రచారానికి కొదువేముంది?

టిఫిన్ వేళ వచ్చారని విసుక్కుం టూనే రాజుని మంచంపై పడుకోబెట్టి నందని చూస్తుండమని చెప్పిలేచితలుపు బార్లా తెరిచి ప్లీజ్ ! కమిన్' అన్నాను ఎదురుగా ఎవరున్నారో కూడా సరిగ్గా చూడకుండా.

వెంటనే నా ఆశ్చర్యానికి అంతు లేదు.

ఎవరో స్త్రీ !

మొదట్లో నివ్వెర పోయినా మరు క్షణంలో 'రండి !" అన్నాను కాస్త సంకోచంగానే.

గదిలోకి వచ్చింది. ఆవిడ అంటే అన్యాయమే అవుతుంది. ఎందుకంటే ఆవిడ వెంట మనోహరమైన పరిమళం కూడా ప్రవేశించింది. ఎన్నాళ్ళనుండో ఆకలిగొన్న జీవికి కడుపునిండా ఆహారం దొరికినట్టుగా ఆమెని చూసి వింతగా ఆనందంగా చూస్తున్నారు పిల్లలు.

'కూర్చోండి' అని కుర్చీ జరిపాను ఆమె వైపు.

కూర్చుంది ! సామాన్యంగానా ?

ఒక మహారాణి సింహాసనంపై తనని చూడటానికి వచ్చే వాళ్ళకి దర్శనం యిచ్చేందుకయినా అలా కూర్చోగలదా? మధుర మధురమైన పరిమళాలు ఆవిడ నుండి నిర్గమిస్తూ మెల్లిగా తిరుగుతున్న ఫ్యాన్‌గాలికి గదినంతా నింపుతోన్నాయ్.

అదే క్షణంలో స్నానాల గదిలోంచి ప్రవేశించిందిఆమె! కుర్చీలో కూర్చున్న క్రొత్త వ్యక్తిని చూసి ఆగిపోయింది ఓ క్షణం తర్వాత 'నందా ! యిలారా' అని పిలిచింది, వెళ్ళింది నంద.

'ఎవరావిడ ?' ప్రశ్నించింది క్రొత్త వ్యక్తి,

'మా ఆవిడ ?' అన్నాను.

ఆమె కళ్ళల్లో ఏదో తెలియని భావం తారట్లాడింది.

ఇంతలో ఆవిడ వచ్చి మంచంపై కూర్చుంది.

'నమస్తే !'

'నమస్తే !'

'మీ ఆవిడ పేరు ?' నావైపుచూస్తూ ప్రశ్నించింది. జవాబుగా 'కవిత' అంది మా ఆవిడ.

'నా పేరు కల్హార ప్రియ... మిసెస్ మరీచిక అనీ అంటారు"

'మళ్ళీ ప్రసక్తి లేదు, నాకు ఆకలి చంపేస్తుంది. ఎందుకొచ్చిందో ? ఏదైనా సినిమా ఛాన్సుకు ? నేనేం చెయ్యగలను. ఫీల్డ్‌కి నేను యింకా కొత్తే !' మన సులో ఆలోచనలు దొర్లుతున్నాయ్.

'మీ పెళ్ళై ఎన్నేళ్ళయింది ?' ఆవిడనే ప్రశ్నించింది ఆమె.

'పన్నెండేళ్లు'

ఓ క్షణం ఆగి నా వైపుచూసి 'అలా అయితే మరి నాతో అలా ఎందుకు చెప్పారు ? మోసం చెయ్యటం మీకు భావ్యమా ?' అంది దీనంగా.

నిర్ఘాంత పోయాను. క్షణంలో

ఆశ్చర్యం, కోపం నా మనస్సుని ఆక్ర మించుకున్నాయ్. మాట కాస్త దూకుడు గానే వచ్చింది. 'ఏమిటి ? ఏమంటు న్నావ్ ? అసలు నీ వెవరు ? ఈ గది లోకి సరిగా విచారించే వచ్చావా ? నీవేం మాట్లాడుతున్నావో తెలుస్తుందా ?"

నా ప్రశ్నలకి వలవలా ఏడ్చింది ఆమె.

క్షణంక్రితం మహారాణిలా ఠీవిగా కూర్చున్న ఆమె క్షణంలో శోకమూర్తి పరి దీనమూర్తి! దగా పడిన అమా యిక.

ఆవిడవైపు తిరిగి అంది "చూశారా కవితా! ఎంత తెగించారో ఆయన! చేసింది చాలక దబాయిస్తున్నారు. ఇలా ఎందర్ని చేశారోవారు" అంది కోపమూ దుఃఖమూ మిళితమైన కంఠంతో.

కవిత నా వేపు చూసింది.

ఆ చూపులో వున్న అనుమానానికి చలించి పోయాను. ఏమైంది మాకు ? ఎందుకిలా జరుగుతోంది ? అయిదు నిమిషాల వరకూ హాయిగావున్న మాకు ఏమిటి శిక్ష ? ఎవరయినా కావాలని చేస్తోన్నారా ఇదంతా ? ఏమి తోచక కుర్చీలోంచి లేచి 'చూడండి ! ఇలా మమ్మల్ని బాధించి లాభంలేదు, అసలు విషయమేమిటో చెప్పండి' అన్నాను.

మా ఆవిడవైపుచూసి ఆవిడ ముఖం లోనూ అదేభావం కనిపించగా మెల్లిగా చెప్పసాగింది. ఆమె కంఠంలో దుఃఖంవల్ల జీర వస్తుంది.

"యుగయుగాలుగా ఆడది యీ దేశంలో మోసగింప బడుతూనే వుంది. యుగాలు మారినా తరాలు మారినా నమ్మి తమ సర్వస్వంతాము నమ్మినవాడి చేతిలో పెట్టిన ఆడదాని గతి యింతే !

నేనూ ఆయనా బి. ఏ. లో క్లాస్ మేట్స్ మి మాత్రమే. క్లాసులోఎప్పుడూ ఆయన ఫస్ట్! నేను సెకండ్!! తర్వాత యూనివర్శిటీలో చేరాము ఆయన లిటరేచర్ తీసుకున్నారు. నేనుసైకాలజీ తీసుకున్నాను. ఆ రెండేళ్ళలో మా యిద్దరి మధ్యా స్నేహం బాగా పెరిగింది. విశాఖపట్నంలో బీచ్‌లో మేం ఎన్నిసార్లు మనస్సులు విప్పు కున్నామో ఆ సముద్రుడికే తెలుసు! ఆ సైకత [illegible]ణులకే ఎరుక!

యూనివర్శిటీ పరీక్షలయ్యాక, విడి పోయి వూళ్ళోకి వెళ్ళేరోజు వచ్చింది. ఆయన్ని విడువటానికి నేను పడిన బాధకన్న నన్ను వదలటానికే ఆయన బాధపడ్డారు. చివరికి ఓ నిశ్చయానికి వచ్చాము. [illegible] అన్నవరం కొండ మీద మా పెళ్ళి అయిపోయింది. తర్వాత ఆ రాత్రే విశాఖలోని ఓ ధరీదైన హోటల్లో నా సర్వస్వమూ వారైనారు.

తర్వాత వారం రోజులకి ఎవరి వూళ్ళకి వాళ్ళంపోయాం. మళ్ళీ రిజల్ట్సు వచ్చేదాక ఆయన సమాచారం తెలీ లేదు. రిజల్ట్సు వచ్చాయ్. ఇద్దరికీ క్లాసు

వచ్చింది. అప్పుడు మళ్ళీ యూనివర్సిటీలో కలిశాం: వాళ్ల నాన్నగారు పోయారనీ అందుకే యిన్నాళ్ళూ ఉత్తరమైనా రాయలేదనీ అన్నారు. నమ్మాను. తర్వాత ఆయన బి. ఏడ్‌లో చేరారు. నేను రీసెర్చికి వెళ్ళాను.

కాలం హాయిగానే గడచేది. కులాలు వేరవటం వల్లనూ, యింటికి ఆయనే పెద్ద కావటం వల్లనూ ఇంకా పెళ్ళి కావలసిన ఆడపిల్ల లుండటం వల్లా పెళ్ళి విషయం బయటపెట్ట వద్దన్నారు. అలాగే గడిచింది. ఆయన ట్రెయినింగ్ అయ్యాక కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. నా రిసెర్చి మామూలుగా సాగుతుంది,

నెల కొకసారి వచ్చేవారు. నాకు డాక్టరేట్ వచ్చేసేదాకా అలాగేజరిగింది. తర్వాత ఆయనే పట్టిపట్టి ఫారిన్‌లో ఏదో పోస్టు ఖాళీ పడితే అప్లై చేయించారు. సులభంగా వచ్చింది. బలవంతం చేసి పంపారు.

నెల క్రితం తిరిగి దేశం వచ్చేశాను. మద్రాస్ ఏర్‌పోర్ట్‌లో రిసీవ్ చేసుకున్నారు. వెళ్ళి హోటల్లో దిగాం. వూరెళదాం అన్నారు. ఇందరి పెళ్ళిళ్లూ అయ్యాయి. ఇంకేం అడ్డు లేదన్నారు. నమ్మాను. అక్కడే హాయిగా గడిపేద్దాం ఓ నెల అన్నారు. మధ్య మధ్య ఎక్కడికో వెళ్ళేవారు. ఒక్కో రోజు రాత్రి కూడా వచ్చేవారు కాదు.

మొన్న ఆ వీక్లీలో ఆయన ఫొటో పరిచయం చూశాక ఆశ్చర్య పోయాను. ఎస్సెసెల్సీ చదివే రోజుల్లోనే పెళ్ళయిందనీ, ఒక కొడుకు కూడా వున్నాడనీ చదివి నిర్ఘాంత పోయాను. నిలదీసి ఏమిటీ మోసం అని అడుగుదామనుకున్నాను. కానీ ఆయన పత్తులేదు. చివరికి ఆయన అడ్రస్ సంపాదించి వచ్చాను.

అనుకోకుండా నేను యిదే లాడ్జిలో దిగటమూ, ఆయనా మీరూ యిక్కడికే రావడమూ దైవఘటన. ఇప్పుడేం చెయ్యాలో నా బ్రతుకేం కావాలో మీరే చెప్పండి."

ఆవిడ చెప్పే కథ చాలా బావుంది. అన్నీ నిజమే కానీ అలాటి వ్యక్తితో నీకు పెళ్ళి కల్పించుటమే చిత్రంగా వుంది.

అంతా విన్న కవిత నా వేపు చూసింది.

"నిజం చెప్పు ఎవరు నువ్వు? ఎందుకిలా అబద్ధమాడుతున్నావ్?" అరిచాను.

"ఎందుకలా అరుస్తారు?"

'కవితా?'

'ఆవిడ చెప్పిందంతా అబద్ధమేనంటారు?

'నా చదువు విషయం కుటుంబ విషయం తప్ప'

'అయ్యో!'

'మీరూరుకోండి' అని - నా వేపు తిరిగి' మన రాజు తలపై చేయి వేసి

చెప్పింది. నిజంగా ఆమె మీ కేమీ కాదా ?'

పన్నెండేళ్ళు సంసారం చేశాక కూడా కవిత నన్ను విశ్వసించలేకపోతుందనే బాధ నన్ను ఎక్కువగా వేధించింది జాలిగా అవమానకరంగా ఆమె వేపు చూశాను.

'నన్ను నమ్మలేవా?'

'నమ్మక కాదు'

'సర్లే, నేను ప్రమాణం చేస్తాను ! నీకు నా మాటమీద కంటే నా ప్రమాణం పైనే విశ్వాసం వుంటే నేను చేయగలిగింది ఏముంది ?' నీరసంగా అన్నాను.

'ఆగండి, ప్రమాణం ఎందుకు ? ఋజువు చూపిస్తాను అయినా నేనూ అన్నవరంలో పెళ్ళిచేసుకున్నపుడుతీసిన ఫొటో చూపిస్తాను. నమ్ముతారా ?'

'వూ('

'నమ్మాక ?'

నమ్మాక ఆయని నీ క ప్ప గిం చి నా దారి....'దుఃఖంలో ఆవిడ నోటంట మాట రాలేదు.

'కవితా !'

ఓ క్షణంఆగి వాలెట్ తెరిచి'ఇదిగో! చూడండి' అని కవితకి చూపింది.

ఫొటో చూశాక కవిత నన్నుచూపిన చూపు -' మన్మథుణ్ని దహించిన త్రినేత్రుడిని రతీదేవి కూడా అలా చూసి వుండదు.

'కవితా !'

'ఆగండి నన్ను ముట్టుకోకండి ! మీరు ఆవిడసొమ్ము' తీవ్రంగా అంది.

పరిస్థితి ముదురుతుంది ఆవేశం పట్టలేక ఆవిడ చేతిలోని ఫొటో లాక్కున్నాను.

'మీరు దాన్ని చించినా నెగిటివ్ వుంటని మరువకండి' అంది.

ఫొటో చూశాను ! నేను నేనే ! ఆవిడ ! ఆవిడ !....

ఓహ్ !

నిదానించి చూశాను. నా దుఃఖము ఆవేశమూ, కోపమూ అన్నీ క్షణంలో మాయమయ్యాయి. పెదవులపై మంద హాసం చిందులాడింది. కవితా గాబరాగా నన్నే చూస్తోంది. కల్హారప్రియ చిరు దరహాసం విసర్తోంది.

దగ్గరిగా వెళ్ళాను. భుజంపై చేయి వేసి 'నిజం ప్రియా నేను నిన్ను పెళ్ళాడింది నిజం! నా భార్యనీ నిన్నూ యిన్నాళ్ళు మోసం చేశాను, నన్ను క్షమించు'అని అవ్యవధిగా ఆవిడ చెక్కిలి ముద్దు పెట్టుకుని విగ్ లాగేశాను.

'రేయ్ ! రేయ్ !' గాబరాగాఅన్నాడు వాడు

ఆశ్చర్యం ! ఆనందం ! కవిత తేరుకుని నవ్వుతోంది.

'కవితా ! వీడు నిరంజన్ ! కాలేజీ డ్రామాలో వేషంవేశాడు. మేము హీరో హీరోయిన్స్‌మి... తర్వాత వాడు ఆడ వేషాలు వేస్తూ నాటక కళకి సేవ చేస్తున్నాడు. చివరికి వాడి నాటకం నా పైనే ప్రయోగించాడు. వెరీగ్లాడ్, వెరీగ్లాడ్! కంగ్రాచ్యులేషన్స్ !'

ముసి ముసి నవ్వులు నవ్వాడు నీరూ,

సిగ్గుతో నవ్వుతో తలవంచుకుంది కవిత.

[అంకితం : స్త్రీ పాత్రల ద్వారా ఆంధ్రదేశంలో 'స్థానం' సంపాదించుకున్న మిత్రులు శ్రీ బుద్ధి సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి ప్రేమతో]